సాక్షి
తిరుపతి
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



కలెక్టరేట్‌లో నిరసనల హోరు
వివిధ సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నాలు నిర్వహించారు.
- 8లో



అక్రమ మైనింగ్
అధికారుల ఉదాసీనత వల్లే మైనింగ్ అక్రమంగా తరలుతోందని ఆల్ ఇండియా యువజన సంఘం నాయకులు ఆరోపించారు.
- 8లో



ఆర్టీసీకి నష్టం
ఆర్టీసీకి నష్టాల బాట పట్టింది. జిల్లాలో 84 దుకాణాలు ఖాళీగా ఉన్నా అధికారులు టెండర్లు నిర్వహించని పరిస్థితి
- 8లో

న్యూస్‌రీల్

శ్రీవాణి ట్రస్ట్ కౌంటర్ పరిశీలన



శ్రీవాణి కౌంటర్‌ను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్

రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయంలోని శ్రీవాణి ట్రస్ట్ కౌంటర్‌ను సోమవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టికెట్లు పొందుతున్న భక్తులతో మాట్లాడారు. భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. విమానాశ్రయంలోని కౌంటర్లో భక్తులు రోజువారీ టికెట్లు ఎన్ని తీసుకుంటున్నారని కౌంటర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఔత్సాహిక రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సీమ పందుల పెంపకంపై నైపుణ్యాభివృద్ధిపై సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ బీ.శోభామణి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సీమ పందుల పెంపకాన్ని చేపట్టి అధిక లాభాలను ఆర్జించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ శ్రీలత, ప్రొఫెసర్ కే.సుజాత, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 90 ఫిర్యాదులు



ఫిర్యాదులు అందుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాపరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెలువెత్తినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 90 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అర్జీలను పరిష్కరించాలని ఆయా స్టేషన్ల సిబ్బందిని ఆదేశించారు.

కన్నీటి వరద

ఒకే నెలలో రెండు సార్లు కురిసిన భారీ వర్షాలకు సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లోని నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పొలాలు నీటిలో మునిగి చెరువులను తలపించాయి. 2,100 ఎకరాల్లో వరి పైర్లు నీటమునిగి పాచిపోయాయి. 30 వేల ఎకరాల్లోని ఉద్యాన పంటలు దెబ్బ తిన్నాయి. ఇసుక మేటలు వేయడంతో పొలాలు సాగుకు పనికిరాకుండా పోయాయి. రూ.కోట్లలో నష్టం సంభవించింది. సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకుండా పోయింది.



సూళ్లూరుపేట నియోజకవర్గం, పాములకాలువ ధాటికి ఇసుక మేటలతో నాశనమైన వరి నాట్లు

ఒకే నెలలో రెండు తుపాన్లు

- భారీ వర్షాలకు పొంగిన నదులు, వాగులు, వంకలు
- 2,100 ఎకరాల్లో నీట మునిగిన వరి
- 30 వేల ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- పంట పొలాల్లో ఇసుక మేటలు
- సాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు
- ప్రభుత్వం నుంచి కనిపించని స్పందన

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ తుపాను వర్షాలు అల్లకల్లోలం చేశాయి. నవంబర్ నెలాఖరు అంటే 30న ఫెంగల్ తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. అప్పుడప్పుడే నాటుతున్న లేత పైర్లు నీటమునిగిపోయాయి. అప్పుడు చేసిన గాయానికి మందు వేసుకునే లోపు బంగాళాఖాతంలో మరో అల్పపడిన ద్రోణి పలకరించింది. మరోమారు వరిపైర్లు నీటి మునిగిపోయాయి. ముందు కురిసిన వానలకు వచ్చిన వరదల్లో సంభవించిన నష్టాన్ని అంచనాలు వేసే లోపే మరో ఉపద్రవం వచ్చి పడింది. వరి పైర్లు నీటి మునిగి ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

తిరుపతి జిల్లాలో తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేటతో కలుపుకుని ఏడు నియోజకవర్గాలున్నాయి. ఇందులో నియోజకవర్గానికి ఒక నది, నదీ స్థాయిలో ఉన్న పెద్ద పెద్ద కాలువలు ప్రవహిస్తున్నాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో కాళంగినది, స్వర్ణముఖినది, మామిడి కాలువ, పాములు కాలువ, కరిపేటి కాలువ, పుచ్చాకాలువ, దొండకాలువలు ప్రవహిస్తున్నాయి. గూడూరు నియోజకవర్గంలో కైవల్యానది, పంబలేరు, స్వర్ణముఖినది, మామిడి కాలువలు ఉన్నాయి. వెంకటగిరి నియోజకవర్గంలో కైవల్యానది, పంబలేరు, తెలుగుగంగ బ్రాంచి కెనాల్స్, సత్యవేడు నియోజకవర్గంలో ఆరణియార్, పాములకాలువ, కాళంగినది, రాళ్లేరు, నంతవేలూరు వద్ద పలు కాలువలు, శ్రీకాళహస్తిలో స్వర్ణముఖీ, మల్లెమడుగు, రామాపురం రిజర్వాయర్, తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో స్వర్ణముఖినది, ఇతర కాలువలు ప్రవహిస్తున్నాయి. జిల్లా పరిధిలోని ఏడు నియోజకర్గాల్లో ఎక్కువగా వరిపంటే సాగులో ఉంది. గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో వరి పైర్లతో సమానంగా నిమ్మ, మామిడి, వేరు శనగ, మిరప పంటలు వేస్తుంటారు.

పెట్టుబడి సాయం, పంట నష్ట పరిహారం శూన్యం

గడిచిన ఐదేళ్లలో రైతన్నలకు సీజన్ ప్రారంభం కాగానే పెట్టుబడి సాయం కింద రూ.15 వేలు దాకా బ్యాంక్ ఖాతాలో వేసేవారు. కూటమి ప్రభుత్వ ఏర్పడి ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. ఎన్నికలకు ముందు ఎకరానికి రూ.20 వేలు అందిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ ఊసే ఎత్తడం లేదు. ఒకసారి వరదలొచ్చి నష్టం జరిగితే దాన్ని ఇంతవరకు ఎన్యూమరేషన్ కూడా చేయించలేదు. రెండు విడుతల్లో సుమారు 21 వేల ఎకరాలు వరి పంట నీటిమునిగిపోయి పనికి రాకుండా పోతే ప్రభుత్వ అధికారులు ఇప్పటి దాకా మదింపు వేయడానికి రావడం లేదంటే ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో తెలుస్తోంది.

2,100 వేల ఎకరాల్లో వరి మునక

ఈ రబీ సీజన్ జిల్లా వ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో సాగుచేస్తుంటారు. వర్షాలు వచ్చిన సమయానికి 1.7 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఇందులో కొంత భాగం వెద్దిపైర్లు వేశారు. మరో 30 వేలు ఎకరాల్లో ఇంకా సాగుపనులు చేపట్టాల్సి ఉంది. ఈ నెల ప్రారంభంలో పెంగాల్ తుపాన్ ప్రభావంతో 1,100 ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగాయి. రెండోసారి కురిసిన భారీ వర్షాలకు మరో వెయ్యి ఎకరాల్లో వరి తీవ్రంగా దెబ్బతింది. ఒకే వారంలో రెండు సార్లు వరదలొచ్చి రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి. దీంతో సుమారుగా 2,100 వేల ఎకరాల్లో వరినాట్లు, వెన్నుమీదున్న పైర్లు దెబ్బ తిన్నాయి. అదే విధంగా 30 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రెండు వేల ఎకరాల్లో వేరుశనగ, సమారు వెయ్యి ఎకరాల్లో మామిడి పంట, మరో ఐదారు వందల ఎకరాల్లో నిమ్మచెట్లు దెబ్బతిన్నాయి. ఇంకా ఆకు కూరలు, కాయగూరలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే తీరప్రాంత నియోజకవర్గాలైన సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లోనే పంట నష్టం ఎక్కువగా జరిగింది. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో పంట నష్టం పాక్షికంగానే దెబ్బతినింది. వరి పైర్లు దెబ్బతిన్న రైతులకు మరోమారు నార్లు పోసుకుని వరినాట్లు వేసేకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నీటమునిగిన వరినాట్లు



వెంకటగిరి నియోజకవర్గంలో మామిడితోటలో తగ్గని వరదనీరు

ఐదెకరాల్లో పంట పాచిపోయింది



నేను ఐదు ఎకరాల్లో వరి నాట్లు వేశా. వర్షాలకు పంట బాగుందనుకునే సమయంలో రెండు సార్లు కురిసిన భారీ వర్షాలకు ఐదెకరాల్లోని వరి మొత్తం పాచిపోయి ఎందుకూ పనికి రాకుండా పోయింది. వ్యవసాయాధికారులు ఎవరూ కూడా ఇటువైపు వచ్చి చూడ లేదు. రెండోసారి నాట్లు వేసుకోవడానికి ప్రభుత్వం విత్తనాలను మంజూరు చేయాలని కోరుతున్నా. **– మనీష్, ఆరూరు, చిట్టమూరు**

పది ఎకరాల్లో పంట మునిగింది



పాములకాలువ వరదనీటిలో పది ఎకరాలు వరి నాటు పైరు ఎందుకూ పనికి రాకుండా పోయింది. ఎకరానికి సుమారు రూ.15 వేలుకు పైగా ఖర్చు చేశాం. రెండు సార్లు మునగడంతో నాటు మొత్తం కుళ్లిపోయింది. మళ్లీ నారు పోసుకుని నాటుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏటా ఈ పాములకాలువకు లక్ష రూపాయలు సమర్పిస్తూనే ఉన్నాము. ఇలాంటి ప్రభుత్వం పంట నష్ట పరిహారమైనా ఇవ్వాలి కదా. **– వాకాటి బాబురెడ్డి, సూళ్లూరుపేట**

నష్టపరిహారం ఇవ్వాలి



రెండు సార్లు వచ్చిన భారీ వర్షాలకు పైరు మొత్తం మునిగిపోయింది. ఏటా ఈ విధంగా నష్టాలను ఎదుర్కొంటూనే ఉన్నాము. ఇప్పుడైనా ప్రభుత్వం ముందుకొచ్చి నష్ట పరిహారం ఇవ్వడంతో పాటు సబ్సిడీ కింద విత్తనాలు, ఎరువులు ఇస్తే రైతును కొంత ఆదుకున్నట్టుగా ఉంటుంది. **– ఈశ్వర్‌రెడ్డి, అమ్మపాళెం, శ్రీకాళహస్తి**

నిమ్మ, మామిడి చెట్లకు దెబ్బ



ఈ నెలలో వారం గ్యాప్‌లో రెండు సార్లుగా కురిసిన భారీ వర్షాలకు నిమ్మ, మామిడితోటల్లో నీళ్లు నిలిచిపోయాయి. ఊటు ఎక్కి చెట్లు చనిపోయేలా ఉన్నాయి. ఇదే జరిగితే నిమ్మ, మామిడి రైతులకు తీరని నష్టం వాటిల్లుతుంది. మా నిమ్మతోటలో కూడా నీళ్లు నిలిచి పోయి ఊటు ఎక్కి చెట్లు చనిపోతున్నాయి. వ్యవసాయాధికారులు స్పందించి దీనిపై సర్వే చేయాలి. **– గుంటమడుగు, శ్రీనివాసరాజు, వెంకటగిరి**

రేణిగుంట-గూడూరు మధ్య మూడో లైన్ అవసరం

- వైఎస్సార్ సీపీ ఎంపీల ప్రశ్నలకు కేంద్ర మంత్రుల సమాధానం



మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ



పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

సాక్షి, న్యూఢిల్లీ: పెరుగుతున్న రైల్వే ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని రేణిగుంట–గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం అత్యవసరమని వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్రానికి సూచించారు. లోక్‌సభ జీరో అవర్‌లో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో నెలకొన్న రైల్వే సమస్యలను కేంద్రం దృష్టికి తెచ్చారు. కోవిడ్–19 సమయంలో వెందోడు, నాయుడుపేట, సూళ్లూరుపేట కొన్ని రైళ్ల హాల్ట్ ఎత్తేశారని వాటిని పునరుద్ధరించాలన్నారు. తిరుపతి–విశాఖపట్నం మధ్య వందే భారత్ స్లీపర్ రైలు సేవలను అందించడం ద్వారా యాత్రికులకు వేగవంతమైన ప్రయాణ సౌకర్యాలు లభిస్తాయని ఎంపీ వివరించారు.

జన్‌సమర్థ్‌కు 45,869 దరఖాస్తులు

సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు 'జన సమర్థ్' అనే పోర్టల్‌ను కేంద్రం తీసుకొచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ ఎంపీ పి.వి.మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ పోర్టల్‌కు ఏపీ నుంచి ఇప్పటి వరకు 45,869 దరఖాస్తులు అందినట్లు కేంద్ర మంత్రి చెప్పారు.

న్యాయమూర్తులకు శిక్షణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి రామ్‌గోపాల్

తిరుపతి లీగల్: రాయలసీమ ఉమ్మడి జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన 30 మంది న్యాయమూర్తులకు తిరుపతి శ్వేత భవనంలో సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులు ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రాష్ట్ర, ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవ సంస్థలు, తిరుపతి మండల న్యాయ సేవ సంస్థ సంయుక్తంగా ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నాయి. తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి జీ.రామ్‌గోపాల్‌తో పాటు సీనియర్ ట్రైనీలు ఈ శిక్షణ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు జిల్లాలకు చెందిన 30 మంది న్యాయమూర్తులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించనున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 66,160 మంది స్వామివారిని దర్శించుకోగా 22,724 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.47 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గ్రీవెన్స్‌కు సమయపాలన లేదా?



ఉదయం 9.45 గంటల నుంచే గ్రీవెన్స్ చాంబర్ ముందు వేచి ఉన్న అర్జీదారులు



ఉదయం 10.24 గంటల వరకు వచ్చిన అధికారులు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సమయపాలన లేకుండా పోతోంది. ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సిన గ్రీవెన్స్ 10.24 గంటల దాటినా అధికారులెవరూ కనిపించడంలేదు. సోమవారం ఉదయం 10.25 గంటలకు డీఆర్వో నరసింహులు వేదికపై రాగా.. ఆ తర్వాత అర్జీల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. అధికారులు మాత్రం ఒక్కొక్కరుగా 11.20 గంటల వరకు వస్తూనే ఉన్నారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ గ్రీవెన్స్ వేదికపై ఉంటే 100 శాతం అధికారులు వారి సీట్లలో ఉంటారు. అదే జేసీ శుభం బన్సల్ ఉంటే 75శాతం మంది అధికారులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. అలాగే డీఆర్వో నరసింహులు ఉంటే 50 శాతం మంది అధికారులు అందుబాటులో ఉంటున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నేతృత్వంలో గ్రీవెన్స్ నిర్వహిస్తే 40 శాతానికి మించి అధికారులు రావడంలేదు. పలు విభాగాలకు చెందిన అధికారులు కలెక్టరేట్ కార్యాలయంలోని తమ చాంబర్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ తమ సబార్డినేటర్లను గ్రీవెన్స్‌కు పంపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో చేసేది లేక అధికారుల కోసం ఉదయం 9 గంటల నుంచే అర్జీదారులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

గ్రీవెన్స్‌కు 150 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా నలు మూలల నుంచి మొత్తం 150 వినతులు వచ్చాయి. ఇందులో 94 అర్జీలు రెవెన్యూకు సంబంధించినవేనని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు హాజరై అర్జీలు స్వీకరించారు.

క్లుప్తంగా

ఎస్ఏ-1 పరీక్ష వాయిదా

తిరుపతి ఎడ్యుకేషన్ : ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు సోమవారం నిర్వహించాల్సిన ఎస్ఏ-1 మ్యాథ్స్ పరీక్ష 20వ తేదీకి వాయిదా పడింది. ఈ పరీక్షకు సంబంధించిన మ్యాథ్స్ ప్రశ్నపత్రం ఉదయాన్నే యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో విద్యాశాఖాధికారులు ఖంగుతిన్నారు. వెంటనే ఈ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా నిలుపుదల చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ డీఈఓలకు ఉత్తర్వులు జారీచేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్ష తరహాలోనే ఈ ప్రశ్నపత్రాలను సమీప పోలీస్‌స్టేషన్లో భద్రపరిచి పరీక్ష సమయానికి ముందు తెచ్చుకోవాలని ఆదేశించారు. దీంతో డీఈఓ కేవీఎన్.కుమార్ సూచనల మేరకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి ఆర్.వంశీరాజ పర్యవేక్షణలో ఎంఈఓలు ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్లకు తరలించారు.

రెండు బార్ల లైసెన్సు మంజూరుకు దరఖాస్తులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లాలోని గూడూరు డివిజన్‌లో రెండు బార్లకు ఈ ఆక్షన్ ద్వారా ఆన్‌లైన్ లైసెన్స్ మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. గూడూరు మున్సిపాలిటీ పరిధిలో ఒక కోటి మూడు లక్షల 61,250 రూపాయలు, మరో దానికి 69 లక్షల 26,250 రూపాయలు నిర్ణీత ధరలు పెట్టారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని దక్కించుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌ద్వారా ఈనెల 16వ తేదీ 10 గంటలకు ఎన్‌రోల్‌మెంట్ స్వీకరించనున్నట్టు వెల్లడించారు. 22 నుంచి 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ఆక్షన్ ముగుస్తుందన్నారు. అదే రోజు మూడు గంటలకు షాపులు కేటాయింపు జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు తిరుపతి ఎక్సైజ్ శాఖ వారిని సంప్రదించాలని సూచించారు.

మండల స్థాయిలోనే పరిష్కరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: మండల, డివిజన్ స్థాయి సమస్యలు ఆ పరిధిలోనే పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అన్ని విభాగాల అధికారులతో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులతో కలసి సమావేశం నిర్వహించారు. అదే క్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల, డివిజన్ స్థాయి అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

పాలకుల నిర్లక్ష్యం.. ఆర్టీసీకి నష్టం



జిల్లాలో ఆర్టీసీ డిపోల సంఖ్య	11
సర్వీసులు	802
విద్యుత్ బస్సులు	100
ఉద్యోగులు	4,256
రోజువారి ప్రయాణికులు	5.2 లక్షలు
రోజు వారి రాబడి	రూ.1.60 నుంచి రూ.170 కోట్లు
ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్	01
ఆర్టీసీ దుకాణాలు	476
దుకాణాలతో ఏడాది రాబడి	రూ.44 కోట్లు
ఏడాదికి కార్గో రాబడి	రూ.5 కోట్లు

ప్రగతి రథం నష్టాల వైపు దూసుకుపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక వచ్చే ఆదాయమూ రాకుండా పోతోంది. తిరుపతి జిల్లాలో ప్రధానంగా ఆరు నెలలుగా 84 దుకాణాలు ఖాళీగా ఉన్నా వీటికి టెండర్లు పిలిచి అప్పగించే నాథుడే లేకుండా పోయారు. ఫలితంగా నెలకు రూ.90 లక్షలు.. అంటే ఇప్పటి వరకు రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లింది. అయినా సంబంధిత ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండగా.. ప్రభుత్వమూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఫలితంగా ఆర్టీసీ మరిన్ని నష్టాల్లో కూరుకుపోతోంది. ఇప్పటికైనా కళ్లు తెరుస్తారో.. లేక అలాగే వదిలేస్తారో వేచి చూడాలి మరి.

- తిరోగమనంలో తిరుపతి జిల్లా ఆర్టీసీ
- 84 దుకాణాలు ఖాళీగా ఉండడంతో నెలకు రూ.90 లక్షలకు పైగా అద్దె నష్టం
- ఈ ఆరు నెలల్లో వాటిల్లిన నష్టం రూ.5 కోట్లపైనే
- కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత పిలవని టెండర్లు
- మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే మరింత నష్టం వాటిల్లే అవకాశం
- గత సర్కార్‌లో ప్రతి నెలా ఖాళీలకు ఆర్టీసీ టెండర్లు
- జిల్లాలో ఆర్టీసీ దుకాణాలు 476
- తిరుపతి బస్టాండ్‌లో మూతపడుతున్న మరుగుదొడ్లు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- అవస్థల్లో ప్రయాణికులు

తిరుపతి అర్బన్: ఆర్నెళ్ల కిందట వరకు ఆదాయాలు ఆర్జించిన ఆర్టీసీ సంస్థ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత నష్టాల బాటలో నడుస్తోంది. జిల్లాలో 11 డిపోలు ఉన్నప్పటికీ జిల్లా కేంద్రమైన తిరుపతి డిపో అత్యంత ముఖ్యమైంది. తిరుపతి





ఖాళీగా ఉన్న స్కూటర్ స్టాండ్, కార్గో పాయింట్ పక్కన మూతబడిన మరుగుదొడ్డి

బస్టాండ్ నుంచి రోజూ 1.20 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అంటే ఏ స్థాయి లో ప్రాధాన్యత ఇవ్వాలో తెలుస్తోంది. ఈ బస్టాండ్ ప్రాంగణంలో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు పేరుతో నాలుగు బస్టాండ్ల సముదా యం ఉంది. ఇంత పెద్ద బస్టాండ్‌లో కేవలం మూడు చోట్ల మాత్రమే టాయ్‌లెట్స్ నిర్వహణలో ఉన్నా యి. ఇటీవల ఆ మూడు చోట్లా మరుగుదొడ్లు నిర్వహిస్తున్న వారు కూడా తమకు దుకాణాలు వద్దంటూ ఆర్టీసీ అధికారులకు లెటర్లు ఇచ్చేశారు. ఈక్రమంలో శ్రీహరి బస్టాండ్‌లోని కార్గో పాయింట్ సమీపంలోని మరుగుదొడ్డి కౌంటర్ ఇప్పటికే మూతపడింది. అదే బస్టాండ్‌లో వెంకటగిరి ప్లాట్‌ఫాం వద్ద ఉన్న మరుగుదొడ్డి, శ్రీనివాస బస్టాండ్‌లోని కాణిపాకం ప్లాట్‌ఫాం వద్ద ఉన్న మరుగుదొడ్డి మూతవేయాలని నిర్ణయించారు. అయితే ఆర్టీసీ అధికారుల సూచనలతో నిర్వాహకులు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ఆ రెండు కూడా మూత వేస్తే తిరుపతి బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఉండవని అంతా ఆందోళన చెందుతున్నారు.

84 దుకాణాలు 6 నెలలుగా ఖాళీ

జిల్లాలో 84 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. ఒక్క తిరుపతిలోనే 40 దుకాణాలు ఆరు నెలలుగా ఖాళీగా ఉంచేశారు. దీంతో నెలకు రూ.90 లక్షలు చొప్పున ఆరు నెలల్లో రూ.5 కోట్లకు పైగా ఆర్టీసీకి నష్టం వచ్చిందని ఉద్యోగులు బాహాటకంగానే విమర్శలు చేస్తున్నారు. తిరుపతి బస్టాండ్‌లో 172 దుకాణాలు, శ్రీకాళహస్తిలో 90, పుత్తూరులో 44, సత్యవేడులో 24, గూడూరులో 27, వెంకటగిరిలో 39, వాకాడులో 35, సూళ్లూరుపేట బస్టాండ్ పరిధిలో 45 దుకాణాలు ఉన్నాయి. మొత్తంగా 476 దుకాణాలు ఆర్టీసీ పరిధిలో నడుస్తున్నాయి. వీటి ద్వారా రూ.44కోట్ల రాబడి ఉంది. అయితే తిరుపతి బస్టాండ్ పరిధిలోని 40 దుకాణాలు, జిల్లాలోని ఇతర బస్టాండ్ల పరిధిలో 44 దుకాణాలు 6 నెలలుగా ఖాళీగా దర్శనం ఇస్తున్న వాటికి టెండర్లు ఆహ్వానించలేదు. దీంతో పెద్దఎత్తున ఆర్టీసీకి రాబడి తగ్గింది.

ఖాళీ ఉద్యోగాలు భర్తీ ఊసేదెప్పుడో?

ఖాళీ అయిన ఉద్యోగులను ఆరు నెలలుగా ఎక్కడా ఆర్టీసీలో భర్తీ చేయలేదు. జిల్లా స్థాయి డీపీటీఓ(జిల్లా ప్రజా రవాణా అధికారి) అధికారి నుంచి డీఎం స్థాయి అధికారులను సైతం భర్తీ చేయకుండా ఇన్‌చార్జ్‌ల పాలనతోనే నెట్టుకొస్తోంది కూటమి సర్కార్. అయితే దుకాణలను భర్తీ చేయడానికి సమయం లేదా అంటూ పలువురు విమర్శలు చేస్తున్నారు.

గత సర్కారులో ప్రతి నెలా టెండర్లు

జిల్లావ్యాప్తంగా ఆర్టీసీకి చెందిన 11 బస్టాండ్ల పరిధిలో 476 దుకాణాలు ఉన్నాయి. అద్దె రూపంలో వీటి ద్వారా నెలకు రూ.2 కోట్లకు పైగా రాబడి వస్తోంది. అంటే ఏడాదికి వీటి రాబడి రూ.44 కోట్లపై మాటే. ప్రతి నెల 5 నుంచి 10 దుకాణాలు ఖాళీ అవుతుంటాయి. అయితే 2014-18 కాలంలో ఖాళీ అయిన దుకాణాలను ఆరునెలలకు ఒకసారి టెండర్లు ఆహ్వానించి అద్దెకు ఇచ్చేవారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెల టెండర్లు ఆహ్వానించి ఏ నెలలో ఖాళీ అయితే ఆ నెలలోనే వాటిని భర్తీ చేసేవారు. దీంతో ఆర్టీసీకి రాబడి మరింతగా వచ్చేది. అంతేకాకుండా జిల్లాలోని 11 డిపోలో ఆధారంగా ప్రతి రోజూ ప్రయాణం చేస్తున్న 5 లక్షల మంది ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుందని అలాంటి నిర్ణయాన్ని తీసుకున్నారు.

ఆర్టీసీకి అండగా వైఎస్సార్ కుటుంబం

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధికి దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనిది. ఆర్టీసీ అప్పుల ఊబిలో కూరుకుపోతున్న తరుణంలో గట్టుకు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ఉద్యోగులకు విదితమే. ఆ తర్వాత ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కూడా ఆర్టీసీ అభివృద్ధికి అండగా నిలిచారు. 2020-21లో కోవిడ్ సమయంలో సైతం అనేక రాష్ట్రాల్లో ఆర్టీసీ సంస్థ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వలేదు. అయితే మన రాష్ట్రంలో క్రమం తప్పకుండా అందించారు. అంతేకాకుండా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులుగా ఉన్న వారిని ఉద్యోగులుగా మార్చిన ఘనత కూడా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే. తిరుపతి జిల్లా విషయానికి వస్తే రాష్ట్రంలో మొట్టమొదటిగా 100 విద్యుత్ బస్సులను తిరుపతి జిల్లాకు కేటాయించారు. అందులో 50 సర్వీసులు తిరుమలకు, మరో 50 సర్వీసులు రేణిగుంట ఎయిర్‌పోర్టుతో పాటు కడప, నెల్లూరు, మదనపల్లెకు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గడిచిన ఐదేళ్లుగా రాష్ట్రంలో రాబడిలో తిరుపతి జిల్లానే మొదటిస్థానంలో నిలిచింది.

త్వరలో టెండర్లు పిలుస్తాం



జిల్లాలోని అన్ని బస్టాండ్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను భర్తీ చేయడానికి త్వరలో టెండర్లు నిర్వహిస్తాం. ఈ నెల చివరి వారంలో లేదా జనవరి మొదటి వారంలో టెండర్లు ఆహ్వానించడానికి ప్రయత్నాలు చేస్తాం. దుకాణాలు ఖాళీగా ఉంటే ఆర్టీసీకే నష్టం అనే సమాచారాన్ని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఆ మేరకు చర్యలు చేపడుతాం.

– జగదీష్, జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ)

మరుగుదొడ్లకు టెండర్లు ఆహ్వానిస్తాం



తిరుపతి బస్టాండ్‌లోని ముగ్గురు మరుగుదొడ్లు నిర్వహిస్తున్న వారు తామకు వద్దంటూ లెటర్లు ఇచ్చేశారు. అద్దె కట్టలేకపోతున్నామని వెల్లడించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్వహణకు నెలకు రూ.4 లక్షలు చెల్లించాలి. అదనంగా జీఎస్టీ, విద్యుత్, వాటర్ చార్జీలు ఉన్నాయి. అయితే యూరిన్‌కు ప్రయాణికులు వెళ్లడానికి ఉచితం. మరుగుదొడ్డికి మాత్రమే ఒక్కో వ్యక్తి నుంచి రూ.3 మాత్రమే వసూళ్లు చేయాల్సి ఉంది. ఈ నిబంధనలు స్పష్టం చేశాం. మరోవైపు ఖాళీగా ఉన్న స్కూటర్ స్టాండ్‌కు, మరుగుదొడ్లకు టెండర్లు ఆహ్వానించడానికి ఏర్పాట్లు చేస్తాం.

– డీఆర్ నాయుడు, ఏటీఎం, తిరుపతి బస్టాండ్

అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయండి



మాట్లాడుతున్న ఏబీఆర్ఎస్ఎం సభ్యులు

తిరుపతి సిటీ: రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవీ.రామిరెడ్డి సూచించారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న డాక్టర్ గంగినేని రంగనాథ్ కర్ణాటక సెంట్రల్ వర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియామకమైన సందర్భంగా ఎస్వీయూలో ఆయనను ఆ సంఘం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ గత పదేళ్లగా దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో దాదాపు 30 శాతం అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. వీటిని వెంటనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, కామర్స్ హెడ్ ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, డాక్టర్ ఎన్. బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ రంజని, డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ వివేక్, డాక్టర్ మహేంద్ర నాథ్ చౌదరి, డాక్టర్ రమేష్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ స్వాతి పాల్గొన్నారు

అధికారుల ఉదాసీనతవల్లే అక్రమ మైనింగ్

- ఇలాగే కొనసాగితే గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తా

చంద్రగిరి: చంద్రగిరిలో అక్రమ మైనింగ్‌కు అధికారుల ఉదాసీనతే కారణమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి ఆరోపించారు. చంద్రగిరి గ్రామ లెక్కదాఖలా సర్వే నం.1479లోని పత్తిగుట్టలో సుమారు 3 ఎకరాల్లో అక్రమంగా సహజ సంపదను దోచేస్తున్నారని మండిపడ్డాడు. ఈ మేరకు సోమవారం సంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ శివరామ సుబ్బయ్య, సీఐ సుబ్బరామిరెడ్డిను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా పత్తిగుట్టను అక్రమార్కులు కొల్లగొట్టుతున్నా రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు స్పందించక పోవడం బాధాకరమన్నారు. ఇలాగే కొనసాగితే గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తామని ఆయన హెచ్చరించారు.

ఆటో దొంగల అరెస్ట్

- నాలుగు ఆటోలు స్వాధీనం

తిరుపతి క్రైం: నగరంలో ఆటోలు దొంగతనం చేసే ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రూ.6 లక్షల విలువ చేసే నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పరపల్లి జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన దొడ్డి కార్తీక్(23), కోటకొండ లలిత్‌కుమార్(20)ను అరెస్ట్ చేసి తమదైన శైలి విచారించామన్నారు. నగరంలో ఆటోలు, ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్నట్లుగా విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6 లక్షల విలువ చేసే నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వీరిద్దరూ కూడా చిన్నతనం నుంచి దొంగతనానికి అలవాటు పడినట్టు తెలిపారు.

వృద్ధురాలి గొంతునులిమి..!

- ఇంట్లో నగలు దోచుకెళ్లిన దుండగులు



మృతి చెందిన జీవరత్నమ్మ

చంద్రగిరి: వృద్ధురాలిని హతమార్చి, ఆమె మెడలోని బంగారు చైన్‌తో పాటు ఇంట్లోని నగలను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లిన ఘటన తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పాడిపేటలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పాడిపేట బజారువీధికి చెందిన గడ్డం జీవరత్నమ్మ(63) తన కుమార్తె లలిత భర్త మృతి చెందడంతో ఆమెతో కలసి జీవనం సాగిస్తోంది. ఆమె కుమారుడు యచేంద్రకుమార్, తిరుచానూరు వసుంధరనగర్‌లో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో లలిత ఉద్యోగ నిమిత్తం సోమవారం నారాయణవనానికి వెళ్లింది. దుండగులు సాయంత్రం ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం ఆమె కేకలు వేయకుండా గొంతునులిమి హతమార్చారు. ఆపై ఆమె మెడలోని బంగారు చైనుతో పాటు ఇంట్లో ఉంచిన నగలను దుండుగులు దోచుకెళ్లారు. సాయంత్రం ఇంటికొచ్చిన కుమార్తె కన్నీటి పర్యంతమైంది. అనంతరం తిరుచానూరు పోలీసులకు సమాచారం అందించింది.

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం దుంగలతో పాటు స్మగ్లర్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం: అన్నమయ్య జిల్లా, చెయ్యేరు నదీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసినట్టు సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్, డీఎస్పీలు జీ.బాలిరెడ్డి, వీ.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ సానిపాయ బేస్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ టీమ్ జాండ్రపెంట సమీపంలోని గురవు బాట చెయ్యేరు వైపు కూంబింగ్ చేపట్టారన్నారు. సోమవారం తెల్లవారు జామున మేకల కోన వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారని చెప్పారు. దీంతో వారిని చుట్టుముట్టి పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు దుంగలు పడేసి పారిపోయారని, అందులో ఒకరిని పట్టుకున్నారని టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు తెలిపారు. ఆ ప్రాంతంలో పరిశీలించి చూడగా, ఆరు ఎర్రచందనం దుంగలు లభించాయని, వాటిని స్వాధీనం చేసుకుని పట్టుబడిన స్మగ్లర్‌ని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించినట్టు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

రాష్ట్ర టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ చైర్మన్‌గా సురేష్



సురేష్

చంద్రగిరి: రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ చైర్మన్‌గా చంద్రగిరి కృష్ణారెడ్డి చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ పడిగల సురేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో జరిగిన ఎన్నికల్లో సురేష్‌ను చైర్మన్‌గా ఎంపిక చేసినట్టు అసోసియేషన్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. అనంతరం చైర్మన్ సురేష్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించి వారి భవిష్యత్‌కు మరింత తోడ్పాటు అందిస్తానని తెలిపారు. వీలైనంత త్వరగా జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా క్రీడలలో ప్రతిభావంతులని గుర్తించి, తదుపరి జరగబోవు లీగ్ మ్యాచ్‌ల వివరాలను ప్రకటించనున్నట్టు వెల్లడించారు.

కలెక్టరేట్‌లో నిరసనల హోరు



విద్యుత్ సమస్య పరిష్కరించాలంటున్న కళ్యాణ వెంకటేశ్వరపురం, మూలకోన గ్రామస్తులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న చేపల చిరు వ్యాపారులు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా పలువురు తమ సమస్యలను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తోపాటు ఇతర అధికారులకు తెలియజేశారు. కొందరు తమకు పింఛన్లు ఇవ్వాలంటూ మొరపెట్టుకుంటే.. మరికొందరు వర్షాలతో రోడ్లు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకొందరు వర్షాలతో తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేకుండా పోయిందని వాపోయారు. మొత్తంగా గ్రీవెన్స్‌కు సోమవారం వెయ్యి మంది వరకు వివిధ సమస్యలతో కలెక్టరేట్‌కు వచ్చారు.

నాకు పక్షవాతం..పింఛన్ ఇప్పించండి

'మాది దొరవారిసత్రం మండలం, తనియాలి గ్రామం. నా పేరు మునిరాజ. పక్షవాతం నేపథ్యంలో కాళ్లు, చేతులు సక్రమంగా పనిచేయవు. తల ఓ వైపు తీవ్రమైన నొప్పి ఉంది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడిని. ఇప్పుడు ఏదీ లేకుండా పోయింది. ఆరు నెలలుగా పింఛన్ కోసం భార్యాబిడ్డలతో కలిసి కలెక్టరేట్‌కు వస్తున్నా. ఎవరూ పట్టించుకోలేదు' అని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ పక్షవాతానికి సంబంధించి మంచానికే పరిమితం అయితే మాత్రమే పింఛన్‌కు అర్హులని, ముందుగా సదరన్ సర్టిఫికెట్ తీసుకొస్తే పరిశీలిస్తామని చెప్పారు.

రోడ్డు లేదు సారూ

తిరుపతి రూరల్ పరిధిలోని తిరుచానూరు పంచాయతీకి చెందిన పలువురు కలెక్టర్‌ను గ్రీవెన్స్‌లో కలిశారు. తమ కాలనీలకు రోడ్డు చూపించాలని మొరపెట్టుకున్నారు, పరాశక్తి వేల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామనగర్, బృందా హౌసింగ్, సాయిసుధ లేఅవుట్, మైత్రేహి, సాక్షిలక్ష్మి లే అవుట్ ప్రాంతాల్లో 450 కుటుంబాలు నివాసం ఉన్నట్లు చెప్పారు. అయితే గతంలో ఉన్న రోడ్లు వరదల నేపథ్యంలో ఛిద్రమైనాయని చెప్పారు. తాజాగా కొంతకాలం నుంచి ఓ ప్రైవేటు స్కూల్ రోడ్డు మీదుగా తమ లే అవుట్లకు వెళుతున్నామన్నారు. అయితే ఆ స్కూల్ యాజమాన్యం ఆ దారిలో వెళ్లకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. తమకు దారి చూపించాలని కోరారు.

ఉపాధి అవకాశాలు కల్పించండి

'విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో బీఎస్సీ(వీఓసీ)ఎంఎల్‌టీ కోర్సులను పూర్తిచేశాం. అయితే తమకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. తమకు ఉపాధి అవకాశాలు చూపాలి' అని పలువురు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఇప్పటికే మూడు బ్యాచ్‌లు కోర్సులను పూర్తిచేశాయని, అయితే ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

పుత్తూరు మండలంలోని కళ్యాణ వేంకటేశ్వరపురం, మూలకోన గ్రామానికి చెందిన పలువురు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిశారు. వర్షాల నేపథ్యంలో తమ గ్రామానికి వచ్చే విద్యుత్ వైర్లు, విద్యుత్ స్తంభాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో విద్యుత్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనంతరం కలెక్టరేట్ వద్ద గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ వినతిపత్రాన్ని అందించారు.

న్యాయం చేయండి

ఎస్పీడీసీఎల్ కార్యాలయ మార్గంలో రోడ్లపై చేపల వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారని, తమకు న్యాయం చేయాలంటూ పలువురు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. రైతు బజారులో ఖాళీగా ఉన్న గదులు కేటాయిస్తే ఆ ప్రాంతంలో వ్యాపారం చేసుకుంటామని చెప్పారు. లేదంటే న్యూ బాలాజీ కాలనీలో ఖాళీగా ఉన్నచోట అవకాశం కల్పించాలని కోరారు. వారికి మద్దతుగా ఏఐటీయూసీ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, వీధి వర్తక వ్యాపార ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, మరో నేత ఎన్‌డీ రవి నిలిచారు.